గ్రామాల్లో బెల్ట్ షాపుల జోరు

- నిర్వాహకులకు అండగా అధికారులు
- మూడు క్వార్టర్లు.. ఆరు బీర్లుగా కొనసాగుతున్న దందా
- ఇబ్బందుల్లో గ్రామస్తులు



నిజామాబాద్ రూరల్: పట్టణాల్లో ఉండాల్సిన మద్యం దుకాణాలు నేడు పల్లెల్లో గల్లీకొకటి వెలుస్తున్నాయి. మద్యం విక్రయితలు విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు చేపడుతున్నారు. దీంతో ఉదయం నుంచి రాత్రి వరకు మద్యం అమ్మకాలు జోరుగా సాగుతుండడంతో బెల్టు షాపుల్లో మద్యం ఏరులై పారుతోంది. బెల్టుషాపులు లేవని అధికారులు చెబుతున్నా అవి లెక్కల వరకు పరిమితమవుతున్నాయి. ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయించేలా, కల్తీ మద్యాన్ని అరికట్టేలా చర్యలు తీసుకోవాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో బెల్టు షాపు నిర్వాహకులకు హద్దు లేకుండా పోతోంది. దీంతో వారి వ్యాపారం మూడు క్వార్టర్లు, ఆరు బీర్లుగా కొనసాగుతోంది. రూరల్ మండలంలోని విలీన గ్రామాలైన గంగస్థాన్ ఫేస్–1,2 గూపన్‌పల్లి, మాధవనగర్, మారుతినగర్, ఖానాపూర్, కాలూర్, భాగ్యనగర్, మహ్మద్‌నగర్‌లో బెల్ట్‌షాపులు విచ్చలవిడిగా నడుస్తున్నాయి.

రూరల్ మండలంలో అధికంగా ఇండస్ట్రీయల్ ఏరియా ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రాంతాల్లో పని చేసే కార్మికుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. వీరు బెల్ట్‌షాప్‌ల్లో దొరికే మందును అధిక ధరకు కొనుగోలు చేస్తూ జేబులను గుల్ల చేసుకుంటున్నారు. గుండారం, మల్కాపూర్(ఎ) గ్రామాల్లో బెల్ట్‌షాపులు ఎక్కువ ఉన్నట్లు సమాచారం.

పట్టించుకోని అధికారులు

గ్రామాల్లో మద్యం అమ్మకాలు సిండికేట్‌గా మారడంతో బెల్టుషాపులు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. హోటళ్లు, కిరాణా షాపులు బెల్టు షాపులుగా తయారవుతున్నాయి. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు లాభార్జన ధ్యేయంగా గ్రామీణ ప్రాంతాల వారికి విక్రయిస్తున్నారు. సంబంధిత ఎక్సైజ్ అధికారులు మాముళ్ల మత్తులో ఉండి పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహించడం వల్ల కూలీ పనిచేసే కార్మికులు, మద్యానికి బానిసైన కుటుంబాలు అప్పుల పాలై రోడ్డున పడుతున్నాయి. చేసిన కష్టమంతా తాగుడికే ధారపోస్తున్నారు. ఇకనైనా బెల్టుషాపుల నిర్వాహకులపై ఎక్సైజ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

క్లుప్తంగా

భవన నిర్మాణ పనుల పరిశీలన



సిరికొండ: మండలంలోని చీమన్‌పల్లి వద్ద నిర్మిస్తున్న గిరిజన బాలుర గురుకుల పాఠశాల భవనాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం పరిశీలించారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆదేశానుసారం భవనాన్ని పరిశీలించినట్లు ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు సంతోష్ నాయక్ తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే మూడేళ్ల నుంచి పనులు పూర్తి కాలేవన్నారు. భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి గిరిజన విద్యార్థులకు ఇబ్బంది లేకుండా నూతన భవనాన్ని అందించాలని కాంట్రాక్టర్‌ను ఎమ్మెల్యే ఆదేశించారని ఆయన తెలిపారు. నాయకులు బాల్‌రాజ్‌నాయక్, చందర్‌నాయక్, మాన్‌సింగ్, రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి ఘన స్వాగతం



సిరికొండ: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికై జిల్లాకు వచ్చిన దినేశ్ కులాచారికి పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. మండలానికి చెందిన పార్టీ నాయకులు ఇందల్‌వాయి టోల్ ప్లాజా వద్దకు తరలివెళ్లారు. ఆయనను శాలువా, పూలమాలతో సన్మానించారు. పార్టీ మండల అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి, అల్లూరి రాజేశ్వర్‌రెడ్డి, రామస్వామి, నక్క రాజేశ్వర్, గోవింద్, రంజిత్‌రెడ్డి, శంకర్, సతీశ్, బాబురావు, మారుతి, కిరణ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందల్వాయి: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి నియమితులై జిల్లాకి వచ్చిన కులాచారి దినేశ్‌కి ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద బీజేపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం ఘన స్వాగతం పలికారు. జిల్లా ఉపాధ్యక్షుడు కేపీ రెడ్డి, మండల అధ్యక్షుడు సత్యనారాయణ, నాయిడి రాజన్న, చిన్ను, కుంట మోహన్ రెడ్డి, జగత్‌సింగ్, సక్కి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రేపు గొర్రెపాటి స్మారక పుస్తక పరిచయ సభ



నిజామాబాద్ సిటీ: ప్రముఖ న్యాయవాది, హక్కుల నాయకుడు గొర్రెపాటి మాధవరావు పుస్తక పరిచయ సభను విజయవంతం చేయాలని కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మగుట్టలోని కార్యాలయంలో నాయకులు పోస్టర్లను ఆవిష్కరించారు. మాధవరావు మానవ హక్కుల రక్షణకు తన చివరి ఊపిరి వరకు ఉద్యమించారని అన్నారు. మాధవరావును స్మరిస్తూ 65 మంది రచయితలు, కవులు స్మారక వ్యాసాలు రాశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఆకుల పాపయ్య, వేల్పూర్ భూమయ్య, సాయినాథ్, జి రమేశ్, గగన్, అన్వేష్ పాల్గొన్నారు.

పాఠశాల పరిశీలన



డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని డిచ్‌పల్లి పాఠశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి బుధవారం పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. తెయూ వీసీ యాదగిరిరావు, హెడ్మాస్టర్ బి సీతయ్యను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు ఎంపికైన వంశిక



డిచ్‌పల్లి: మండలంలోని వాణి హైస్కూల్‌లో ఒకటో తరగతి చదువుతున్న గుట్ట వంశిక తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు ఎంపికైంది. రాష్ట్రంలోనే మొదటిసారిగా 215 మంది విద్యార్థినులు ఒకే వేదికపై పేరిణి నృత్య ప్రదర్శన చేయగా తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ మెంబర్స్ తిలకించి వంశిక పేరును మోదు చేశారు. దీంతో పాఠశాలలో బుధవారం నిర్వహించిన సమావేశంలో విద్యార్థిని వంశికను వాణి హైస్కూల్ కరస్పాండెంట్ ఎండీ నబి, హెచ్‌ఎం మోహన్‌రాజు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాపారస్తులు ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్

నిజామాబాద్ సిటీ: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వ్యాపారాలు నిర్వహించే వారు తప్పకుండా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్ సూచించారు. బుధవారం బల్దియా కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవో నం 141 ప్రకారం కార్పొరేషన్ పరిధిలో వాణిజ్య, వ్యాపారాలు కొనసాగించేవారు తప్పకుండా అనుమతి పొందాలన్నారు. వ్యాపారాలు కొనసాగించేవారు వాటిని మార్చి 31లోపు రెన్యూవల్ చేసుకోవాలన్నారు. ట్రేడ్ లైసెన్స్ తీసుకోని వారికి వెంటనే నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. అనుమతి తీసుకోనివారికి 90 రోజుల్లోపు 25 శాతం జరిమానాతో లైసెన్స్ పొందవచ్చని తెలిపారు. సమావేశంలో ఏఎంసీ జయకుమార్, శానిటరీ సూపర్‌వైజర్ సాజిద్‌అలీ, ఎస్సైలు మహేశ్, షాదుల్లా, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాధులపై అవగాహన

మోపాల్: నగరశివారులోని బోర్గాం(పి) జెడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు భార్గవి కుష్టు వ్యాధి నివారణ, ముందు జాగ్రత్త చర్యల గురించి వివరించారు. పలు సూచనలు, సలహాలు చేశారు. క్షయ వ్యాధి రాకుండా జాగ్రత్తలపై కో–ఆర్డినేటర్ రవి గౌడ్ తెలియజేశారు. అదేవిధంగా ఈ నెల 10న నిర్వహించే నేషనల్ డీ వార్మింగ్ డే, అల్బెండజోల్ మాత్రలు, తదితర అంశాలపై సబ్‌సెంటర్ వైద్యులు సంతోష్‌కుమార్ వివరించారు. విద్యార్థులు చిన్ననాటి నుంచి వ్యాధులపై అవగాహన కలిగి ఉంటే భవిష్యత్‌లో వ్యాధులు రాకుండా ఆరోగ్యంగా ఉండొచ్చని వైద్యులు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శంకర్, ఉపాధ్యాయులు, హెల్త్ సూపర్‌వైజర్ ప్రవంతి, శ్రీనివాస్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

జయ కుమార్‌కు ఎంహెచ్‌వో బాధ్యతలు



జయకుమార్

నిజామాబాద్ సిటీ: మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ జయ కుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ (ఎంహెచ్‌వో) బాధ్యతలు కూడా చూడాలని కమిషనర్ దిలీప్‌కుమార్ సర్క్యులర్ జారీ చేశారు. బల్దియాకు ఎంహెచ్‌వో పోస్టు ఉన్నా ఇక్కడ పనిచేయడానికి ఎవరూ రావడం లేదు. దీంతో కొన్నేళ్లుగా ఎంహెచ్‌వో పోస్టు భర్తీ కావడం లేదు. కొన్నేళ్లుగా శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించి పదోన్నతిపై అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన జయకుమార్‌కు ఇన్‌చార్జి ఎంహెచ్‌వో బాధ్యతలు అప్పగించారు. శానిటరీ సూపర్‌వైజర్‌గా సాజిద్ అలీని నియమించారు.

టిఫిన్‌సెంటర్లలో తనిఖీలు

ఎంహెచ్‌వోగా బాధ్యతలు తీసుకున్న రోజే జయకుమార్ నగరంలోని టిఫిన్ సెంటర్లను తనిఖీ చేశారు. బుధవారం ఉదయం వినాయక్‌నగర్, కంఠేశ్వర్‌బైపాస్, ఖలీల్‌వాడీలోని టిఫిన్ సెంటర్లను తనిఖీ చేశారు. పాలిథిన్ కవర్లు వాడుతున్న 5 టిఫిన్ సెంటర్ల నిర్వాహకులకు రూ.11 వేల జరిమానా విధించారు. 125 మైక్రాన్ల కంటే తక్కువ పరిణామం ఉండే కవర్లు వాడొద్దని సూచించారు.



కంఠేశ్వర్ బైపాస్ వద్ద తనిఖీ చేస్తున్న ఎంహెచ్‌వో

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే

బోధన్‌టౌన్: విద్యార్థులకు ఇచ్చిన మాటను బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి నిలబెట్టుకున్నారు. పట్టణంలోని విద్యావాకస్‌లో రిపబ్లిక్ డే రోజున నిర్వహించిన వేడుకలకు ఎమ్మెల్యే హాజరయ్యారు. వేడుకల్లో పాఠశాలకు చెందిన విద్యార్థిని నజ్మా భారతదేశం గొప్పతనం, వివిధ మతాలు వ్యవహరిస్తున్న తీరు, భవిష్యత్తులో వ్యవహరించాల్సిన తీరుపై వివరించింది. దీంతో ఆమె స్పీచ్ బాగుందని, ఆమె బృందానికి రూ. 1లక్ష10 వేలు ఇస్తానని బహుమతి అందిస్తానని మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం బుధవారం పాఠశాల విద్యార్థులకు నగదు బహుమతిని ఎమ్మెల్యే అందజేశారు. విద్యార్థులు బాగా చదువుకొని మంచి ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయాల చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, కళాశాల డైరెక్టర్ శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యార్థులకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే

ముప్కాల్‌లో కేజీబీవీ తనిఖీ

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలోని కేజీబీవీని మండల ప్రత్యేకాధికారిణి ప్రవంతి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట ఎంపీడీవో నరేశ్ ఆనంద్, పాఠశాల ఎస్‌వో వినోద ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో..

వేల్పూర్: మండలంలోని జాన్కంపేట్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీవో బాలకిషన్ బుధవారం తనిఖీ చేశారు. చిన్న పిల్లల బరువును, బాలింతలకు, గర్భిణులకు, చిన్నారులకు అందించే పౌష్టికాహారం స్టాకును పరిశీలించారు. నాణ్యమైన కూరగాయలతో మంచి ఆహారం అందించాలని సిబ్బందికి సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది ఉన్నారు.

లలితాదేవి ఆశ్రమంలో గౌరీవ్రతం



నిజామాబాద్ రూరల్: నగరంలోని న్యాల్‌కల్ రోడ్డులో ఉన్న శ్రీ లలితాదేవి ఆశ్రమంలో బుధవారం గౌరీ వ్రతం, శివపార్వతుల కల్యాణం, చండీ హోమాన్ని ఆలయ ధర్మాధికారి రాజేందర్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కొమ్మ సుధాకర్ గుప్త, మోటూరి వెంకటేశం గుప్తా, నాగరాజు గుప్తా, శేఖర్ గుప్తా, నాగేందర్, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం



ధర్పల్లి: మండల కేంద్రంలోని కేజీబీవీలో జాతీయ బాలికల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లింగ వివక్ష, గుడ్ టచ్–బ్యాడ్ టచ్, విద్య, పలు అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినులకు డ్రాయింగ్, ఉపన్యాస, పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరిత, పోషణ అభియాన్ కో–ఆర్డినేటర్ రంజిత్, కేజీబీవీ ఎస్‌వో సుమలత తదితరులు పాల్గొన్నారు.

సకలమ్మ కుటుంబ సభ్యులకు పరామర్శ



నిజామాబాద్ రూరల్: బీఆర్‌ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ రాష్ట్ర మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఐదవ సోదరి చీటి సకలమ్మ ఇటీవల మృతి చెందారు. సకలమ్మ కుటుంబ సభ్యులైన చీటి నర్సింగరావు, చీటి ఉమేశ్వరరావులను జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు హైదరాబాద్‌లో బుధవారం పరామర్శించారు. సకలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన వెంట కుటుంబీకులు, నాయకులు ఉన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘం సందర్శన



సంఘాన్ని పరిశీలిస్తున్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు

జక్రాన్‌పల్లి: మండలంలోని మనోహరాబాద్‌లో నున్న జేఎం కేపీఎం రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని బుధవారం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు సందర్శించారు. ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఉద్యోగులు రూపేశ్ కుమార్ నాయక్, జనార్దన్, బిగాల్, అధికారులు సదానంద్ ప్రధాన్, తిరుపతి రావు సందర్శించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘం వల్ల కలిగే ప్రయోజనాలను సంస్థ ప్రతినిధులు సంతోష్ రెడ్డి వారికి వివరించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ తిరుపతిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఆలయాల పరిరక్షణకు కృషి చేయాలి



ఆశ్రమంలో పాటల సీడీని ఆవిష్కరిస్తున్న మల్లారం బాలయోగి పిట్ల కృష్ణ మహరాజ్

నిజామాబాద్ రూరల్: ఆలయాల పరిరక్షణకు కృషి చేయాలని మల్లారం బాలయోగి పిట్ల కృష్ణ మహరాజ్ అన్నారు. బుధవారం దేవాలయాల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రూపొందించిన పాటల సీడీని లింగేశ్వర ఆశ్రమంలో బాలయోగి కృష్ణ మహరాజ్ ఆవిష్కరించారు. దేవాలయ పరిరక్షణ సమితి నాయకుడు పటేల్ ప్రసాద్ మాట్లాడుతూ.. ఎంతో పవిత్రమైన అతి పురాతనమైన ఆలయాలను, ఆలయాలకు సంబంధించిన విలువైన భూములను కొందరు కబ్జా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో హిందువుల ఆలయాల, ఆలయాల భూముల పరిరక్షణ కోసం పెద్ద ఎత్తున కాగడాలతో ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

బడ్జెట్‌తో అన్ని వర్గాలకు మేలు

ధర్పల్లి: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులు అన్ని వర్గాల వారికి మేలు చేర్చేలా ఉన్నాయని బీజేపీ మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మధ్యతరగతి వారికి ఆదాయ పన్ను వెసులుబాటుగా రూ.12 లక్షల వరకు మినాయింపు ఇవ్వడం హర్షణీయమని అన్నారు. ప్రధాని మోదీ, కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గంగాదాస్, కర్క గంగారెడ్డి, మహేశ్, పెంటన్న, శంకర్, రాజశేఖర్, రాజు, శ్రీకాంత్, దేవి సింగ్, మురళి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నిజామాబాద్ సిటీ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను నిరసిస్తూ కార్మిక సంఘాలు, కిసాన్ మోర్చ ఆధర్యంలో ధర్నా నిర్వహించాయి. బుధవారం జిల్లాకేంద్రంలోని ధర్నాచౌక్‌లో కేంద్ర ప్రభుత్వం దిష్టి బొమ్మను దహనం చేశారు. అనంతరనం నాయకులు మాట్లాడుతూ.. కార్మికులు, కర్షకులు, సామాన్యులకు వ్యతిరేకంగా, సంపన్న వర్గాలకు మేలు చేసే విధంగా బడ్జెట్ రూపొందించారని విమర్శించారు. శోభన్, నూర్జహాన్, ముష్క సుధాకర్, హనుమాండ్లు, భూమయ్య మాట్లాడుతూ.. దేశంలో సంపదను సృష్టించే కార్మికులు, రైతులపై భారం మోపారని అన్నారు. కార్మికులకు కనీస వేతనాలు పెంచే అంశం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్ బాబు, దేవేంద్ర, చక్రపాణి, వెంకటేశ్, గంగాధరప్ప, వెంకన్న, మల్లేశ్, కిషన్, మురళి, రవి, విఠల్, విఘ్నేశ్, రాములు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

తీన్మార్ మల్లన్న దిష్టిబొమ్మ దహనం



చిత్రపటాలతో నిరసన తెలుపుతున్న సభ్యులు

సుభాష్‌నగర్: రెడ్డిలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ దిష్టిబొమ్మను నగరంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న హనుమాన్ జంక్షన్‌లో రెడ్డి సంక్షేమ సంఘం –369 ఆధ్వర్యంలో బుధవారం దహనం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు గుడిపల్లి నాగిరెడ్డి మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధి అయి ఉండి ఇతర కులాలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, వెంటనే తీన్మార్ మల్లన్న రెడ్డిలపై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రెడ్డి కులానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేకుంటే తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి మూల జనార్దన్‌రెడ్డి, నాయకులు అన్నం సతీశ్‌రెడ్డి, గాదారి సంజీవ్‌రెడ్డి, సాయిరెడ్డి, విజయేందర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, ల్యాబ్ గంగారెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, దామోదర్ రెడ్డి, రాజేందర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	87,000	వెండి(కిలో)	99,000
22 క్యారెట్స్	79,550	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	220	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	8	15	గాజరుగడ్డ	30	50
బెండకాయ	40	80	పచ్చిమిర్చి	40	60
జీరకాయ	50	90	దోసకాయ	30	50
దొండకాయ	35	50	ఆలుగడ్డ	20	40
బీర్నీసుకాయ	40	60	గోబిగడ్డ	10	20
కాకరకాయ	30	50	గోబిపువ్వు	20	40
వంకాయ	30	50	బీట్‌రూట్	30	50
పాలకూర	10	20	కరివేపాకు	60	100
మెంతికూర	15	30	చామగడ్డ	40	80
కొత్తిమీర	10	20	గోరుచిక్కుడు	40	80
పుదీనా	40	80	చిక్కుడుకాయ	30	60
క్యాప్సికం	40	60			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-2	పట్టుదల(తెలుగు)-10.50,1.40, 4.30,7.20,10.15
స్క్రీన్-3	సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు)-11.00, 1.40, 4.40, 7.25, 10.00

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)- 10.30, 1.30, 4.30, 7.30, 10.30
స్క్రీన్-2	పట్టుదల(తెలుగు)-10.05,1.15, 4.25,7.35,10.45
స్క్రీన్-3	స్కై ఫోర్స్(హిందీ)-10.15 డాకు మహారాజు(తెలుగు)-1.00, 7.20 దేవా(హిందీ)-4.05, 10.25
స్క్రీన్ -4	దేవా(హిందీ)-10.00, 7.10 స్కై ఫోర్స్(హిందీ)-1.15, 10.25 మదగజరాజ(తెలుగు)-4.00
లలితామహల్	మదగజరాజ (తెలుగు)
దేవి	డాకు మహారాజు(తెలుగు)
నటరాజ్	రాచరికం(తెలుగు)
విజయ్	సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)